నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి..
www.suryaaepaper.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
11-03-2026
పేజీలు: 02




# రూ.2 లక్షల దిశగా బంగారం

బంగారం అంటే భారతీయులకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ధరలు కొంచెం తగ్గినా వెంటనే కొనాలనే ఆసక్తి చాలా మందిలో కనిపిస్తుంది. బంగారాన్ని కేవలం ఆభరణంగా మాత్రమే కాకుండా భవిష్యత్తుకు భద్రమైన పెట్టుబడిగా కూడా భావిస్తారు. ముఖ్యంగా పెళ్లిళ్లు, పండుగలతో పాటు ఆర్థిక భద్రత కోసం కూడా చాలా మంది బంగారం కొనుగోలు చేస్తుంటారు.ఇటీవల ప్రపంచ రాజకీయ పరిణామాల నేపథ్యంలో బంగారం ధరలపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్—ఇజ్రాయెల్—అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్తతల ప్రభావం బంగారం మార్కెట్‌పై ఎలా ఉంటుందనే చర్చ జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో బులియన్ మార్కెట్‌ను పరిశీలిస్తే భవిష్యత్తులో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరిగిన సమయంలో ధరలు తగ్గుతాయని కొనుగోలుదారులు భావించినప్పటికీ, పరిస్థితి భిన్నంగా మారింది. అమెరికా డాలర్ బలహీనపడటం వల్ల బంగారానికి డిమాండ్ పెరిగింది. దాంతో దేశీయ మార్కెట్లో 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.1,62,000 వరకు చేరుకుంది. అయితే గతంలో నమోదైన జీవితకాల గరిష్ట ధర రూ.1,80,779తో పోలిస్తే ఇది ఇంకా దాదాపు రూ.18,000 తక్కువగానే ఉంది. దీంతో బంగారం కొనాలని చూస్తున్న సాధారణ ప్రజలు, అలాగే పెట్టుబడిదారులు



మార్కెట్ పరిస్థితులను జాగ్రత్తగా గమనిస్తున్నారు. ఇప్పుడే కొనాలా? లేక ఇంకొంతకాలం వేచి చూడాలా? అనే సందేహం చాలామందిలో ఉంది.ఇరాన్‌తో ఉన్న వివాదం త్వరలో ముగిసే అవకాశం ఉందని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కూడా బులియన్ మార్కెట్‌లో చర్చకు దారితీశాయి. సాధారణంగా యుద్ధాలు లేదా రాజకీయ అనిశ్చితి పెరిగినప్పుడు పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడిగా బంగారాన్ని ఎంచుకుంటారు. అయితే ఉద్రిక్తతలు తగ్గి అమెరికా డాలర్ బలహీనపడితే ఇతర దేశాల పెట్టుబడిదారులకు బంగారం మరింత చౌకగా లభిస్తుంది. ఈ కారణంగా బంగారం ధరలు మళ్లీ పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయి. మరోవైపు డాలర్ విలువ తగ్గినప్పుడు ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు బంగారం కొనుగోలు చేయడం సులభమవుతుంది. ఇదే బంగారం ధరలకు మద్దతు ఇస్తుంది. చమురు ధరలు తగ్గడం వల్ల ద్రవ్యోల్బణ భయాలు కొంత తగ్గాయి. దీంతో కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచే అవకాశాలు కూడా తగ్గుతాయి. వడ్డీ ఆదాయం ఇవ్వని బంగారం వంటి పెట్టుబడులు ఇలాంటి సమయంలో పెట్టుబడిదారులను మరింత ఆకర్షిస్తాయి.మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం ప్రస్తుతం బంగారం బలంగా ఉన్నప్పటికీ వెంటనే కొత్త రికార్డులు నమోదు చేసే అవకాశం తక్కువగా కనిపిస్తోంది. కొంతకాలం ధరలు ఒకే స్థాయిలో హెచ్చుతగ్గులతో కదిలే అవకాశముందని వారు భావిస్తున్నారు. అంతర్జాతీయ బులియన్ మార్కెట్‌లో ఔన్సుకు 5,250 డాలర్ల నుంచి 5,300 డాలర్ల మధ్యకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

అదే సమయంలో 5,000 డాలర్ల స్థాయి వద్ద బంగారం మరింత బలంగా నిలబడే సూచనలు కనిపిస్తున్నాయి.దీర్ఘకాలికంగా పరిశీలిస్తే బంగారం ధరలు ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రపంచ కేంద్ర బ్యాంకులు భారీగా బంగారం కొనుగోలు చేయడం, ప్రపంచ రుణభారం పెరగడం, డాలర్‌పై ఆధారపడే వ్యవస్థ తగ్గడం వంటి అంశాలు బంగారం ధరలకు మద్దతు ఇవ్వవచ్చు. ఈ పరిస్థితులు కొనసాగితే అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర ఔన్సుకు 5,600 డాలర్లను దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో భారత మార్కెట్లో కూడా 10 గ్రాముల బంగారం ధర రూ.2 లక్షల స్థాయికి చేరే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.మొత్తం మీద చూస్తే బంగారం ధరల పెరుగుదల ఇక్కడితో ఆగిపోవడం కష్టమే. మధ్యలో కొంతకాలం హెచ్చుతగ్గులు కనిపించినా దీర్ఘకాలంలో పెరుగుదల కొనసాగవచ్చు. అమెరికా డాలర్ విలువ, ప్రపంచ వడ్డీ రేట్లు, అలాగే మధ్యప్రాచ్యంలోని రాజకీయ పరిస్థితులు బంగారం భవిష్యత్తును ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా నిలుస్తాయి. అందుకే పెట్టుబడిదారులు తొందరపడకుండా మార్కెట్ సంకేతాలను గమనిస్తూ నిర్ణయం తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. సరైన పరిస్థితులు ఏర్పడితే బంగారం నిజంగానే రూ.2 లక్షల మైలురాయిని చేరినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదని వారు అంటున్నారు.



## 14న కుల్‌దీప్ వివాహం

భారత స్టార్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ త్వరలో పెండ్లి పీటలెక్కబోతున్నాడు. తన చిన్ననాటి స్నేహితురాలు వన్షికతో ఈనెల 14న ముస్సోరి (ఉత్తరాఖండ్)లోని ఓ రిసార్ట్‌లో కుల్‌దీప్ వివాహం ఘనంగా జరుగనుంది. వివాహం ముగిసిన మూడు రోజుల (17న)కు లక్నోలో రిసెప్షన్ ఏర్పాటుచేసినట్టు కుల్‌దీప్ కుటుంబవర్గాలు తెలిపాయి. వాస్తవానికి నిరుడు నవంబర్‌లోనే కుల్‌దీప్-వన్షికలు ఒక్కటవ్వాల్సి ఉన్నా టీ20 ప్రపంచకప్ నేపథ్యంలో అతడు తన పెండ్లిని వాయిదావేసుకున్నాడు. కాన్పూర్‌కే చెందిన వన్షిక.. ఎల్‌ఐసీలో ఉద్యోగం చేస్తున్నది.



## చెవిరెడ్డిని పక్కన పెట్టిన YS జగన్!

మద్యం కుంభకోణంలో అరెస్ట్ అయి బెయిల్ పై బయటకు వచ్చిన వైసీపీ కీలక నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని YS జగన్ పక్కన పెట్టారని తెలుస్తోంది. ఆయనకు నేరుగా అపాయింట్మెంట్ ఇవ్వకపోవడమే కాకుండా, ఒంగోలు పార్లమెంట్ ఇన్చార్జి పదవి నుంచి తొలగించి, చంద్రగిరి నియోజకవర్గానికే పరిమితం కావాలని సూచించారు. సర్వేలు చేయకూడదని, సోషల్ మీడియా బాధ్యతలను కూడా లాక్కుని సజ్జల భార్గవరెడ్డికి అప్పగించారని సమాచారం. ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి( యాక్టివయ్యారు. చంద్రగిరి నుంచి రెండుసార్లు గెలిచారు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి. జగన్మోహన్ రెడ్డి ప్రోత్సాహంతోనే ఆయన ఎమ్మెల్యే అయ్యారు.

## రూ.500 కోసం మేనేజర్ దారుణ హత్య

హైదరాబాద్‌లోని మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టపగలే షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. జాబ్ ఇప్పిస్తానని రూ.2వేలు తీసుకున్న ప్రభు కుమార్ అనే వ్యక్తి, డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేయడంతో వారాహి కన్సల్టెన్సీ మేనేజర్ శశికిరణ్‌రెడ్డిపై కత్తులతో దాడి జరిగింది. సంస్థ అతనికి రూ.1500 ఆన్‌లైన్ చేయగా, మిగిలిన రూ.500 తర్వాత ఇస్తామని చెప్పింది. అయితే, నిందితుడు వెంటనే మిగిలిన మొత్తాన్ని డిమాండ్ చేయడంతో గొడవ చెలరేగి ఈ దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు.

## హైదరాబాద్‌లో హోటళ్లు బంద్

ప్రధాన కారణం వాణిజ్య గ్యాస్ సిలిండర్ల కొరత ఇరాన్ - ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం కారణంగా గ్యాస్ కొరత దీంతో తాత్కాలికంగా మూసివేత దిశగా హోటళ్లు, హాస్టళ్లు, మెస్‌లు మెనూను కుదించి, ధరలు పెంచిన మరికొన్ని హోటళ్లు వండేందుకు ఎక్కువ నూనె తీసుకునే, ఎక్కువ సమయం తీసుకునే టీ, కాఫీ, చపాతీ, దోశ, పూరిలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన హైదరాబాద్ ఐటీ కారిడార్ హోటళ్ల అసోసియేషన్. ఎక్కువ సేపు వండే వంటలను తగ్గించి అన్నం, సాంబార్, పప్పు, రసంలనే వడ్డిస్తున్న హైదరాబాద్‌లోని పీజీ హాస్టళ్లు, మెస్‌లు, రెండు, మూడు రోజులైతే వీటిని పూర్తిగా నిలిపివేసి, హాస్టళ్లను తాత్కాలికంగా మూసివేయడం తప్పదని తెలిపిన నిర్వాహకులు. రవాణా ఛార్జీలు పెరగడంతో దోశ, పూరి, వడలపై కనీసం రూ.15.. ఇడ్లీ, ఉప్మా లాంటి వాటిపై కనీసం రూ.10 వరకు పెంచిన పెద్ద హోటళ్లు

హైదరాబాద్‌లోని హోటళ్లలో దోశ, పూరి, వడ వంటి అల్పాహారాల తయారీ నిలిపివేయడానికి (బంద్) ప్రధాన కారణం వాణిజ్య గ్యాస్ సిలిండర్ల కొరత.

గ్యాస్ సరఫరా నిలిపివేత: పెట్రోలియం కంపెనీలు డీలర్లకు వాణిజ్య గ్యాస్ సిలిండర్ల సరఫరాను నిలిపివేయడంతో హోటల్ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మెనూలో మార్పులు: ఎక్కువ సమయం గ్యాస్ వినియోగించే దోశ, పూరి, వడ వంటి టిఫిన్లను చాలా హోటళ్లు మరియు పీజీ హాస్టళ్లు తమ మెనూ నుండి తొలగించాయి. కేవలం అన్నం, పప్పు, సాంబారు వంటి తక్కువ సమయంలో పూర్తయ్యే వంటకాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయి.

ధరల పెరుగుదల: గ్యాస్ కొరత మరియు నిత్యావసరాల ధరలు పెరగడంతో, అల్పాహారాల ధరలు సుమారు 10% పెరిగాయి. దోశ, పూరి వంటి



వాటిపై కనీసం 15 రూపాయల వరకు అదనపు భారం పడింది. హోటళ్ల మూసివేత: చిన్న రెస్టారెంట్లు మరియు మెస్‌లు ఒకటి లేదా రెండు రోజులకు సరిపడా గ్యాస్ మాత్రమే ఉండటంతో, త్వరలోనే పూర్తిగా మూతపడే ప్రమాదం ఉందని యజమానులు ఆందోళన చెందుతున్నారు.

## దానం నాగేందర్, కడియం శ్రీహరికి క్లీన్‌చిట్ ఇచ్చిన స్పీకర్

### అనర్హత పిటిషన్లను కొట్టివేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్

తెలంగాణ రాజకీయాల్లో కొంతకాలంగా సాగుతున్న ఉత్కంఠకు నేటితో తెరపడింది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఈ రోజు తుది నిర్ణయాన్ని ప్రకటించారు. విచారణ అనంతరం కడియం, దానం నాగేందర్‌కు ఊరట లభించింది. ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ గడ్డం ప్రసాద్ డిస్మిస్ చేశారు. దానం, కడియంపై దాఖలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో, నిర్ణీత గడువు ముగుస్తుండటంతో స్పీకర్ కార్యాలయం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మొత్తం పదిమంది ఎమ్మెల్యేల్లో ఇప్పటికే ఎనిమిది



మందికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చారు. దానం, కడియంలపై తాజాగా వాదనలు పూర్తికాగా.. నిర్ణయాన్ని ప్రకటించారు. మొత్తం పది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ లభించింది. సుప్రీంకోర్టు సూచనల ప్రకారం మార్చి 12వ తేదీలోపు వీరిద్దరి విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని ప్రకటించాల్సి ఉండగా.. ఒకరోజు ముందే.. స్పీకర్ కడియం, దానం నాగేందర్ పై దాఖలైన రెండు పిటిషన్లను డిస్మిస్ శారు. స్పీకర్ తీర్పు తర్వాత దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని.. వ్యక్తిగత నిర్ణయంతోనే కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేశానని దానం నాగేందర్ పేర్కొన్నారు. తన ఫండమెంటల్ రైట్‌ను కాలరాసే హక్కు ఎవరికీ లేదని.. ఆరు నెలలుగా క్షోభను అనుభవించానన్నారు. స్పీకర్‌ని కూడా ఆరు నెలలుగా ఇబ్బంది పెడుతూ వచ్చారని.. దానం పేర్కొన్నారు. ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా విజయం సాధించిన కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిలు పిటిషన్ వేశారు.



## మాళవిక హాట్ స్టిల్స్

ప్రముఖ నటి మాళవికా మోహనన్ తన కెరీర్ పంథాను మార్చుకుంటున్నారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, ఇప్పుడు యాక్షన్ ఆధారిత పాత్రలపై దృష్టి సారిస్తున్నారు. ఇటీవల ది రాజా సాబ్ చిత్రంలో ఫైట్ సీన్‌లో నటించిన ఆమె, తన తదుపరి చిత్రాలలో మరింత ఇంటెన్స్ యాక్షన్ సన్నివేశాలలో కనిపించనున్నారు. ది రాజా సాబ్ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన మాళవికాకు ఆశించిన విజయం దక్కలేదు. ముఖ్యంగా సినిమాలో ఆమె చేసిన యాక్షన్ సన్నివేశాలపై విమర్శలు వచ్చాయి. ఈ సన్నివేశాలను డూప్‌తో చిత్రీకరించారన్న ఆరోపణలు కూడా వినిపించాయి. ఈ విమర్శలను తిప్పికొట్టేందుకు మాళవిక, తాను స్వయంగా యాక్షన్ సన్నివేశాలలో నటిస్తున్న మేకింగ్ వీడియోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు.




## 12 ఏళ్ల కష్టం తీరింది: హుల్గేరాకు బస్సు సర్వీస్ ప్రారంభం

రాయికోడ్ మండలం హుల్గేరా గ్రామ ప్రజల 12 ఏళ్ల ఆశ నెరవేరింది. సరైన బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, వృద్ధులు, కార్మికులు ఇబ్బందులు పడుతుండగా, గ్రామ సర్పంచ్ గొల్ల నరసింహ యాదవ్ కృషితో హుల్గేరా గ్రామానికి టీజీఎస్ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, నాయకులు కలిసి బస్సును ఆహ్వానించి ఆనందం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా, అందోల్ నియోజకవర్గంలో ఈ బస్సు సర్వీస్ ప్రారంభమైంది.

## ఛాన్స్ కొట్టేసిన అందాల రాశి

ఊహలు గుసగుసలాడే సినిమాతో హీరోయిన్ గా టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయ్యింది అందాల రాశీ. తొలి సినిమాతోనే తన అందంతో ప్రేక్షకులను కట్టిపడేసింది. బబ్లీ లుక్ లో భలే ఉందే ఈ అమ్మాయి అంటూ కుర్రాళ్లంతా రాశీ అందానికి ఫిదా అయ్యారు. తొలి సినిమా మంచి విజయాన్ని అందుకోవడంతో ఈ ముద్దుగుమ్మకు వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. మీడియా రేంజ్ హీరోలందరి సరసన నటించి మెప్పించింది. అలాగే ఎన్టీఆర్ లాంటి స్టార్ హీరోల సరసన కూడా నటించి మెప్పించింది. మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న సినిమాలో రాశీ ఖన్నా హీరోయిన్ గా సెలక్ట్ అయ్యిందని తెలు స్తుంది.




# తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం



తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ ఆయనతో ప్రమాణం చేయించారు. అయితే, ఉత్తరప్రదేశ్‌కు చెందిన శుక్లా అనూహ్యంగా తెలుగులో ప్రమాణం చేసి అక్కడున్న వారందరినీ ఆశ్చర్యపరిచారు. ఈయన తెలంగాణకు నాల్గవ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పలువురు మంత్రులు హాజరయ్యారు. వీరితో పాటు హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ బి.శివధర్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్ శుక్లాకు ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఈ నెల 16వ తేదీ నుంచి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అదే రోజున ఉభయ సభలను ఉద్దేశించి కొత్త గవర్నర్ ప్రసంగించనున్నారు.

# 13 ఏళ్లుగా కోమాలో.. కారుణ్య మరణానికి సుప్రీంకోర్టు అనుమతి



సుప్రీంకోర్టు ఇవాళ కీలక తీర్పు ఇచ్చింది. 13 ఏళ్లుగా అచేతన స్థితిలో ఉన్న ఓ వ్యక్తి కారుణ్య మరణానికి కోర్టు ఆదేశించింది. 32 ఏళ్ల హరీశ్ రాణా అనే వ్యక్తి.. 2013లో బిల్డింగ్ మీద నుంచి కింద పడి కోమాలోకి వెళ్లాడు. అయితే లైఫ్ సపోర్టుపై అతనికి చికిత్స కొనసాగిస్తున్నారు. ఆ కేసులో పాసివ్ యుథనేసియాకు కోర్టు అనుమతి ఇచ్చింది. జస్టిస్ జేబీ పర్దివాలా, జస్టిస్ కేవీ విశ్వనాథ్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసులో ఆదేశాలు ఇచ్చింది. లైఫ్ సపోర్టింగ్ చికిత్స పొందుతున్న హరీశ్ రాణా తండ్రి అశోక్ రాణా దాఖలు చేసిన పిటీషన్ ఆధారంగా కోర్టు అనుమతి ఇచ్చింది. ఈ కేసులో జనవరి 15వ తేదీన కోర్టు తన తీర్పును రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. అయితే హరీశ్ రాణాకు కొనసాగిస్తున్న లైఫ్ సపోర్టు చికిత్సను ఉపసంహరించాలని కోర్టు తన తీర్పులో పేర్కొన్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ హరీశ్ రాణా కోలుకునే అవకాశం లేదని గతంలో రెండు మెడికల్ బోర్డులు పేర్కొన్నాయి. లైఫ్ సపోర్టు చికిత్సను నిలిపివేయాలని ఆ మెడికల్ బోర్డులు సూచించాయని, ఈ దశలో కోర్టు జోక్యం అవసరం లేదని, కానీ ఇది తొలి కేసు కాబట్టి, కోర్టుకు రిఫర్ చేయాల్సి వచ్చిందని బెంచ్ పేర్కొన్నది. చాలా మార్యాదపూర్వకర రీతిలో లైఫ్ సపోర్టును తొలగించాలని కోర్టు తన ఆదేశాల్లో వెల్లడించింది.

# కట్టెల పొయ్యిపై వండుతున్న 'పిస్తా హౌస్'!

హోటళ్లు, రెస్టారెంట్లకు తగ్గిన గ్యాస్ సరఫరా నగరంలోని హోటళ్లలో ప్రస్తుతం ఎల్పీజీ కొరత ఏర్పడింది. గల్ఫ్ సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా చమురు సరఫరా దెబ్బతినడంతో కేంద్రం కమర్షియల్ సిలిండర్ల సరఫరాపై ఆంక్షలు విధించింది. దీనివల్ల నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు గ్యాస్ దొరకక అల్లాడుతున్నాయి. రంజాన్ మాసం కావడంతో హైదరాబాద్‌కే ప్రత్యేకమైన 'హలీం' మెనూ నుంచి తొలగించకుండా ఉండేందుకు ప్రముఖ రెస్టారెంట్ 'పిస్తా హౌస్' సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. గ్యాస్ సిలిండర్ల కొరతను అధిగమించేందుకు పిస్తా హౌస్ యాజమాన్యం తమ వంటశాలల్లో మళ్ళీ పాత కాలపు పద్ధతిలో కట్టెల పొయ్యిలను రంగంలోకి దించింది. అత్యాధునిక గ్యాస్ స్టౌల స్థానంలో పెద్ద పెద్ద కట్టె మోపులతో 'భట్టీ'లను ఏర్పాటు చేసి, హలీం మరియు ఇతర వంటకాలను సిద్ధం చేస్తోంది. గ్యాస్ లేదనే నెపంతో కస్టమర్లను నిరాశపరచకూడదని, సంప్రదాయ పద్ధతిలో కట్టెలపై వండటం వల్ల హలీం రుచి మరింత పెరుగుతుందని నిర్వాహకులు చెబుతున్నారు.



హోటల్ ఆవరణలో కట్టెల పొయ్యిలపై హలీం హండీలు ఉడుకుతున్న దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# వివేకా హత్య కేసులో కుమార్తె సునీతకు చుక్కెదురు




వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో సునీతా రెడ్డికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో తదుపరి దర్యాప్తు అవసరం లేదని సీబీఐ స్పష్టం చేసింది. ఇప్పటికే మూడో సప్లిమెంటరీ ఛార్జ్ షీట్ దాఖలు చేసినట్లు సీబీఐ వెల్లడించింది. దీంతో, సునీతా రెడ్డి దాఖలు చేసిన అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. కాగా, వివేకా హత్య కేసులో అప్పటిలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.అలాగే సీబీఐ అందించిన 13 లక్షల ఫైళ్లలో చాలా వరకు తెరుచుకోవడం లేదని నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నిందితుల తరఫు న్యాయవాదుల వాదనను సీబీఐ ఈ సందర్భంగా తోసిపుచ్చింది. కోర్టు అనుమతి ఇస్తే ఈ ఫైళ్లను తెరిచి చూపిస్తామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ కేసును మంగళవారానికి అంటే.. ఈ రోజుకు కోర్టు వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

# ఇరాన్ కొత్త అధినేతకు కిమ్ జోంగ్ ఉన్ మద్దతు



ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణం తర్వాత ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ బాధ్యతలు చేపట్టిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఖమేనీ వారసత్వాన్ని మొజ్తబా అందిపుచ్చుకోవడాన్ని ఉత్తర కొరియా అధికారికంగా సమర్థించింది. ఇరాన్ ప్రజల నిర్ణయాన్ని తాము గౌరవిస్తామని ప్రకటిస్తూనే.. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలపై ప్యాంగ్యాంగ్ నిప్పులు చెరిగింది. పశ్చిమాసియాలో శాంతిని తుడిచి పెట్టేందుకు వాషింగ్టన్ ప్రయత్నిస్తోందని ఉత్తర కొరియా విదేశాంగ శాఖ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. ఇరాన్ పాలకులను మార్చాలని, అక్కడ తమకు అనుకూలమైన వ్యవస్థను తీసుకు రావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను ఉత్తర కొరియా తప్పుబట్టింది. ఒక దేశ రాజకీయ వ్యవస్థలో జోక్యం చేసుకోవడం, ఆ దేశ ప్రాంతీయ సమగ్రతను దెబ్బతీయడం అరాచకమని ఉత్తర కొరియా విదేశాంగ ప్రతినిధి పేర్కొన్నారు. ఇరాన్ సామాజిక వ్యవస్థను కూలదోసేందుకు అమెరికా-ఇజ్రాయెల్ కూటమి పన్నుతున్న కుట్రలను ప్రపంచం తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఇలాగే చైనా, రష్యాలు సైతం ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా ఎన్నికైన మొజ్తబాకు మద్దతు ఇచ్చాయి. రెండ్రోజుల క్రితమే ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించాయి.

## ప్రపంచవ్యాప్తంగా నిలిచిన ఇన్‌స్టా




ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఇవాళ ఉదయం నుంచి పలు సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ప్రపంచవ్యాప్తంగా చాలా మంది వినియోగదారులు తమ డైరెక్ట్ మెసేజ్‌లు (డీఎంలు) యాక్సెస్ చేయలేకపోతున్నామని, చాట్ థీమ్‌లు మాయమయ్యాయని ఫిర్యాదులు చేస్తున్నారు. సెర్చ్ టూల్ కూడా పనిచేయడం లేదని, కాంటాక్ట్స్ కనిపించడం లేదని ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా నెటిజన్లు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు మెసేజ్‌లు ఉన్నప్పటికీ, నోటిఫికేషన్లు వస్తున్నప్పటికీ మెసేజ్‌ల పేజీ మొత్తం ఖాళీగా కనిపిస్తోందని ఒక యూజర్ పేర్కొన్నారు. "యాప్ మొత్తం విరిగిపోయినట్టుగా ఉంది" అని మరో యూజర్ పోస్ట్ చేశారు. అంతరాయాలను ట్రాక్ చేసే వెబ్‌సైట్ డౌన్‌డిటెక్టర్ ప్రకారం బుధవారం ఉదయం నాటికి 10,000కు పైగా ఫిర్యాదులు నమోదయ్యాయి. ఇందులో అమెరికా నుంచే అధికంగా ఫిర్యాదులు రాగా, భారత్‌లో కూడా వందకు పైగా కంప్లైంట్లు నమోదయ్యాయి.



## అమెరికా దౌత్య మద్దతు కేంద్రంపై దాడిచేసిన ఇరాన్

ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నేటికీ 12వ రోజుకు చేరుకుంది. బుధవారం తెల్లవారుజామున ఇరాక్ రాజధాని బాగ్దాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని అమెరికా దౌత్య మద్దతు కేంద్రం (BDSC)పై డ్రోన్ల దాడి జరిగింది. మొత్తం ఆరు డ్రోన్లు ఈ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకోగా, ఐదింటిని అమెరికా రక్షణ వ్యవస్థలు గాలిలోనే కూల్చివేశాయి. అయితే, ఒక డ్రోన్ మాత్రం కార్యాలయ ప్రాంగణాన్ని తాకడంతో స్వల్ప నష్టం వాటిల్లింది. ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదని ప్రాథమిక సమాచారం.బుధవారం సూర్యోదయానికి ముందే ఇరాన్ తన క్షిపణి ఛత్రాన్ని విప్పింది. ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్, హైఫా నగరాలను లక్ష్యంగా చేసుకుని భారీగా క్షిపణులను ప్రయోగించింది. అలాగే, బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో నావికా దళానికి చెందిన స్థావరంపై కూడా ఇరాన్ దాడులు చేసినట్లు అక్కడి మీడియా వెల్లడించింది. దీనికి ప్రతిగా అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఇరాన్ అంతటా భీకరమైన వైమానిక దాడులను కొనసాగిస్తున్నాయి.



## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట మండలం రామాజీ పేట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య పాల్గొన్నారుయాదగిరిగుట్ట పట్టణానికి చెందిన లబ్ధిదారులు దోశెట్టి లలిత - రామచంద్రయ్య గౌడ్ దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాన్ని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గారు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.పట్టుబట్టలు పెట్టి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా తమకు ప్రభుత్వం కల్పించిన ఈ ఇల్లు కల నిజం కావడంతో ఎంతో ఆనందంగా ఉందని,ఇందుకు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గారు మాట్లాడుతూ.. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని అన్నారు.ఇల్లు లేని పేదలకు గౌరవప్రదమైన జీవితం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని చెప్పారు.ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు ఎల్లప్పుడూ తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గారు పేర్కొన్నారు.

## ప్రియురాలి దగ్గర తన మాట నెగ్గలేదని సూసైడ్ చేసుకున్న ప్రియుడు

కురవికి చెందిన వల్లభనేని శశికుమార్ (21) ఇంటర్‌తో చదువు ఆపేశాడు. ప్రస్తుతం పెయింటింగ్ పనిచేస్తున్నాడు. కేసముద్రం మండలానికి చెందిన యువతితో ఏడాది క్రితం శశికుమార్‌కు పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారింది. దీంతో ఆమెనే పెళ్లి చేసుకోవాలని శశికుమార్ నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే ఇటీవల ప్రియురాలికి ఫోన్ చేసిన శశికుమార్.. బయటకు వెళ్లిపోయి పెళ్లి చేసుకుందామని చెప్పాడు. అందుకు సదరు యువతి నిరాకరించింది. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు అవుతున్నాయని.. అవి పూర్తయ్యాక పెళ్లి చేసుకుందామని సర్దిచెప్పింది. కానీ అందుకు శశికుమార్ వినించుకోలేదు. దీంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. ప్రియురాలి దగ్గర తన మాట నెగ్గలేదని శశికుమార్ తీవ్రంగా మనస్తాపం చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.